




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం 01 ఆగస్టు 2025

పేజీలు 8


## ఈ పాపం ఎవరిది..?



మృతి చెందిన మధు శేఖర్ (ఫైల్‌ఫోటో)

- ఉసురు తీసిన స్మశాన స్థల వివాదం..
- పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య..

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** డెబ్బై తొమ్మిది ఏళ్లస్వతంత్ర భారతదేశంలో నేటికీ ప్రజల అంత్యక్రియలు నిర్వహించేందుకు కొన్ని గ్రామాలలో సరిపడా స్మశాన వాటికలు లేకపోవడం పాలకుల అసమర్థతకు అద్దం పడుతోంది. స్మశాన వాటికకు స్థలం కేటాయించండంటూ ప్రజలు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా అవేవీ వారికి పట్టడం లేదు. డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న స్మశాన వాటిక స్థల వివాదం ఓ ఉసురు తీసింది.

మిగతా 2లో



వివాదంలో ఉన్న స్మశానవాటిక స్థలం దృశ్యం

## ఏసీబీ వలలో చిక్కిన సీనియర్ అసిస్టెంట్

- రూ.40 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్
- ఎకరా పొలం విషయంలో రూ.70 వేలు డిమాండ్
- రైతుతో రూ.50 వేలుకు బేరం కుదుర్చుకున్న సీనియర్ అసిస్టెంట్
- ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా ఉన్నారా..? అన్న కోణంలో విచారణ చేపడుతున్న ఏసీబీ అధికారులు
- మండల,జిల్లా స్థాయి స్పందనలో ఫిర్యాదు ఇచ్చిన పట్టించుకోలేదని బాధిత రైతు ఆవేదన

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల కేంద్రానికి చెందిన రైతు ఈశ్వరయ్య వద్ద ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆర్ రమేష్ రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో జూపాడుబంగ్లాలో దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ సోమన్న మాట్లాడుతూ జూపాడు బంగ్లా గ్రామానికి చెంది న రైతు ఈశ్వరయ్యతల్లి శంకర మ్మ పేరు మీద ఉన్న 80- బన్నూరు పొలిమేరలోని

మిగతా 2లో



ఏసీబీ అధికారుల అదుపులో ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్


## అబార్షన్ వికటించి మహిళ మృతి..!

- లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఆర్ఎంపి..
- అబార్షన్ చేసిన ఆర్ఎంపి వైద్యురాలు
- మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు..
- న్యాయం కోసం పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన మృతురాలి కుటుంబ సభ్యులు



మృతి చెందిన మహిళ శ్రీవాణి

2లో



స్టేషన్ వద్ద బోరున విలపిస్తున్న మహిళ కుటుంబ సభ్యులు

## సామాజిక సేవకు గౌరవం

- శ్రీటౌన్ సిఐ శేషయ్యకు డాక్టరేట్ ప్రదానం

2లో




డాక్టరేట్‌ను అందుకుంటున్న సిఐ పి.శేషయ్య

### పరిశ్రమల స్థాపనకు గడువులోగా

## అనుమతులు మంజూరు చేయాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్‌పోర్టల్ ద్వారా మే 30వ తేదీ నుండి జూలై 30వతేదీ వరకు 870 దరఖాస్తులు రాగా 858దరఖాస్తుల ఆమోదించారని, మిగిలిన 12గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పిఎం విశ్వకర్మకు సంబంధించి 1234దరఖాస్తులు మంజూరు కాగా ఇందులో 989 యూనిట్లకు రుణాలు మంజూరు అయ్యాయని, మిగిలిన వాటికి కూడా రుణాలు మంజూరు

మిగతా 2లో


నేటి దినపత్రిక సూర్యకు19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



గౌ॥.శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
రాష్ట్ర ముఖ్యమంత్రి



గౌ॥. శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు
ఉప ముఖ్యమంత్రి.

కూటమి ప్రభుత్వానికి

కృతజ్ఞతాభివందనములు

రాష్ట్రంలో గౌడ(ఈడిగ) సామాజిక వర్గాన్ని గుర్తించి మద్యం దుకాణాలను కేటాయించి గౌడ కులస్తుల అభ్యున్నతికి పాటుపడిన నవ్యాంధ్ర రథసారథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్య శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు గౌ॥శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి మరియు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు గౌ॥శ్రీ కొల్లు రవీంద్ర గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ..



గౌ॥. శ్రీ నారా లోకేష్ గారు
ఐటీ, విద్యా శాఖ మంత్రి



గౌ॥. శ్రీ కొల్లు రవీంద్ర గారు
ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి

అజంతా వైన్స్ గౌడ సంఘ సభ్యులు

పాములపాడు, నందికొట్కూరు నియోజకవర్గం

# ఈ పాపం ఎవరిది..?

(మొదటి పేజి తరువాయి)

ఆవుల దొడ్డి గ్రామం లోని సర్వేనెంబర్ 575 లోని 45 సెంట్ల స్థలంలో గ్రామానికి చెందిన దళితులు గత కొన్ని సంవత్స రాలుగా చనిపోయిన వారి అంత్యక్రియలు నిర్వహిస్తూ ఉండేవారు. అయితే దాదాపు 20 సంవత్స రాల క్రితం గ్రామానికి చెందిన అల్ల గుండు సుంకన్న అనే వ్యక్తి సదరు సర్వే నెంబర్‌లోని ఎకరా 90 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. అయినప్ప టికీ గ్రామస్తులు అదే స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తూ వస్తుండేవారు.అయితే వైసిపి ప్రభుత్వం హయాంలో జరిగిన రిసర్వేలో సుంకన్న కొనుగోలు చేసిన ఎకరా 90 సెంట్ల భూమిలో కేవలం ఎనిమి ది సెంట్లు మాత్రమే స్మశాన వాటికకు కేటాయిస్తూ మిగిలిన భూమిని అంతా సుంకన్న పేరు మీద అధికారులు ఆన్లైన్లో నమోదు చేశారు .దీనితో సుంకన్న ఎనిమిది సెంట్ల భూమి వదిలేసి మిగతా భూమినంతా ఆధీనంలోకి తీసుకున్నాడు. అప్పటినుంచి స్మశాన వాటిక వివాదంకొనసాగుతూ వస్తుంది.సుంకన్న భూమిని కొనుగోలు చేసినప్పుడే దళితుల స్మశాన వాటికను యధావిధిగా కొనసాగించాలని పొలం అమ్మిన వ్యక్తితో ఖరారు చేసుకున్నారని దళితులు చెబుతున్నారు. ఆ క్రమం లోనే ఇటీవల గ్రామానికి చెందిన కన్నయ్యతో పాటు మరికొందరు దళితులు 45 సెండ్ల స్థలాన్ని స్మశాన వాటిక కేటాయించాలంటూ రెవిన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. అదే సమయంలో మండల సర్వేయర్ జగదీష్ పై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. సమస్య అధికారులు దృష్టికి వచ్చినప్పటికీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో అది కాస్త వివాదంగా మారింది. ఆ క్రమంలోనే బెంగళూరులో సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగించే కన్నయ్య సోదరుడు ఉల్చాల మధు శేఖర్ గ్రామానికి వచ్చాడు. సుంకన్న అతని కుమారుడు శివమ దులు కన్నయ్య ఫిర్యాదును విరమించుకోవాలని గత బుధవారం మధు శేఖర్ పై తీవ్ర ఒత్తిడి తేవడంతో మనస్థాపానికి గురైన మధు శేఖర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు .మధు శేఖరు ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధ వారం మృతి చెందాడు. దీంతో గ్రామంలోని దళిత వాడలో విషాదఛాయలు అలముకు న్నాయి. స్మశాన వాటిక స్థలం కోసమే ఓ నిండు ప్రాణం కోల్పోవడం పట్ల దళితులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సరిపడా స్మశాన వాటిక ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని దళితులకు కోరుతున్నారు.

# అబార్షన్ వికటించి మహిళ మృతి..!

**నందికొట్కూర్ రూరల్ మేజర్ న్యూస్ :** మహిళకు అబార్షన్ వికటించి మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లాలోని పగిడ్యాల మండల పరిధిలోని బీరువోలు గ్రామంలో చోటుచేసుకుంది .వివరాలు ఇలా ఉన్నాయి. బీరవోలు గ్రామానికి చెందిన గుజ్జుల లోకేష్‌కి గడివేముల మండలం గని గ్రామానికి చెందిన శ్రీవాణితో దాదాపు ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. శ్రీవాణికి ప్రస్తుతం నాలుగు నెలలు గర్భవతిగా ఉండేది, శ్రీవాణి భర్త ఆర్ఎంపీ గా పని చేస్తున్న గీతా రాణి వద్ద కారు డ్రైవర్ గా పనిచేసేవాడు, భర్త మంగళవారం ఉదయం తన భార్య శ్రీవాణిని గీతా రాణి దగ్గరకు తీసుకొని రాగా, స్కానింగ్ చేయగా మళ్లీ ఆడపిల్ల ఉందని వారికి తెలిపి ఆర్.ఎం.పి గీతారా ణి వచ్చి రాని వైద్యంతో అబార్షన్ చేయడం జరిగింది. బుధవారం ఉదయం శ్రీవాణికి అధిక రక్తస్రావం కావడంతో కళ్ళు తిరిగి పడిపోయింది. గమనించిన శ్రీవాణి తల్లిదండ్రు లు, మండల కేంద్రమైన పగిడ్యాలలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళగా అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. శ్రీవాణి బంధువులు,తల్లిదండ్రులు నందికొట్కూరు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని తమ కుమార్తెకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయిం చడం జరిగింది. అనంతరం పోలీసులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నారు. నందికొట్కూర్ రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మృతురాలి స్వగ్రామమైన బీరవోలు గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం శవ పరీక్ష నిమిత్తం నందికొట్కూర్ ప్రభుత్వ వైద్యశాలకు శ్రీవాణి మృతదేహాన్ని తరలించారు.

# సామాజిక సేవకు గౌరవం




డాక్టరేట్ అవార్డుతో సిఐ శేషయ్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో త్రీ టౌన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న పెనుగొం డ శేషయ్యకు ఢిల్లీలోని హెచ్‌డిఏసి స్వచ్ఛంధ సంస్థ తరుపున గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. గురువారం ఢిల్లీలోని హోటల్ అశోకా కన్వెన్షన్ హాల్‌లో హెచ్‌డిఏసి,వివిధ దేశాల ప్రతినిధుల సమక్షంలో వివిధ అంశా లపైన యాక్టివ్‌గా పనిచేసిన వారికి డాక్టరేట్ పురస్కారం అందచేశారు. అందులో భాగం గా కడప జిల్లాకు చెందిన సిఐ పి శేషయ్య తాను ఎస్ఐగా విధుల్లో చేరినప్పటి నుండి దాదాపు 17సం॥ లుగా సోషల్ సర్వీసులో యాక్టివ్‌గా పనిచేసినందుకు హెచ్‌డిఏసి సంస్థ సిఈఓ కవిత బజాజ్ చేతుల మీదుగా సిఐ పి శేషయ్య డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నేటి దినపత్రిక సూర్య ప్రతినిధితో చరవాణి ద్వారా మాట్లాడుతూ తాను చేసిన సామాజిక సేవకు గాను ఈ గౌరవ డాక్టరేట్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తను విధుల్లో చేరినప్పటి నుండి ఇప్పటి వరకు అనాథ పిల్లలకు పుస్తకాలు అందచేయడం, ఎయిడ్స్ పేషెంట్ల పట్ల దయాగుణం కలిగి వారికి ధైర్యం చెబుతూ సరైన వైద్యం చేయించడం, రోడ్ల పక్కన అనాథలుగా జీవిస్తున్న వయోవృ ద్దులను వృద్ధాశ్రమంలో చేర్పించడం వారికి ఆర్థిక సహాయం అందించడం, నిస్సహాయులకు తనవంతు సహాయ, సహకారాలు అందించడంలాంటి సేవలు చేశానని, పోలీస్ శాఖలో కూడా సేవా పథకాలు పొందడంతో హెడ్‌డిఏసి సంస్థ తనను గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ అవార్డు వరించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ప్రతిఒక్కరు సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఏసీబీ వలలో చిక్కిన సీనియర్ అసిస్టెంట్

(మొదటి పేజి తరువాయి)

సర్వేనంబర్ 568–ఏలో 70 సెంట్లు, 568–సీలో 30 సెంట్లు మొత్తం ఎకర పొలం ఉంది.ఈ పొలం అనుభవంలో శంకరమ్మ ఉన్నా కూడా అదే సర్వేనంబర్‌కు చెందిన లింగన్న అనే రైతు తమ పొలాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, ఆన్‌లైన్ అడంగల్‌లో కూడా అతని పేరు ఉన్నదని , లింగన్న పేరు తీసేయాలని ఈ ఎకర పొలం విషయంలో అధికారులు డబ్బులు లంచం అడిగినట్లు రైతు ఈశ్వరయ్య ఏసీబీని ఆశ్రయించారని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం జూపాడుబంగ్లాకు వస్తే రూ.40 వేలు ఇస్తానని చెప్పడంతో ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకొని విచారిస్తున్న ఏసిబి డిఎస్పీ సోమన్న తెలిపారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా ఉన్నారేమోనని ఆ కోణంలో కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతు ఈశ్వరయ్య ఐదేళ్ళ నుంచి ఆన్‌లైన్ అడంగల్‌లో ఉన్న లింగన్న పేరు తీసి వేయాలని తిరుగుతున్నామని, ఏడాది కిందట తన తల్లి శంకరమ్మ చనిపోవడంతో తన పేరు మీద మార్చాలని కార్యాలయాల చుట్టు తిరిగినా మార్చలేదని ఈశ్వరయ్య వాపోయాడు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌వోఆర్‌లో మార్చుకోవాలని జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం లో చెప్పడంతో ఆర్డీవోను ఈశ్వరయ్య కలిశారు. ఈ విషయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ రూ.70 వేలు డబ్బులు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.50 వేలకు బేరం కుదుర్చుకొని జులై 23న రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఈశ్వరయ్య ఇచ్చాడు. మిగతా డబ్బులు వారానికి ఇస్తానని చెప్పి ఏసీబీని ఆశ్రయించాడు. మిగతా రూ.40 వేలు ఇస్తానని, జూపాడుబంగ్లాకు గురువారం రమ్మని సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు చెప్పి ఏసీబీకి సమాచారం ఇచ్చి జూపాడుబంగ్లా కేజీ రోడ్డుపై కారులో వచ్చి రైతు నుంచి రమేష్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మేము దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్‌ను కేజీ రోడ్డు తాటిపాడు గ్రామానికి వెళ్ళే దారిలో ఉన్న రైస్‌మిల్ వద్ద విచారణ ఈ దాడిలో సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు, రాజప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఐదేళ్ళ నుంచి విసిగిపోయా నని, మండల స్థాయి స్పందన, జిల్లా స్థాయిలో కలెక్టర్ స్పందనతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేధికల్లో ఇచ్చినా పట్టించుకోలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్‌తో పాటు ఉన్నతాధికారులు, క్రిందిస్థాయి అధికారులు కూడా డబ్బులు అడిగినట్లు రైతు ఆరోపిస్తున్నాడు. పై విషయానికి సంబంధించి అన్ని రకాలుగా విచారణ చేపడుతామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# పరిశ్రమల స్థాపనకు గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

(మొదటి పేజి తరువాయి)

చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్డిఎంను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని, వచ్చే సమావేశం నుండి దరఖాస్తులు పెండింగ్ ఉన్న బ్యాంకర్లు కూడా సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. స్థానికులకు ఉద్యోగ కల్పనలో ఎంత శాతం కల్పించారని వెరిఫై చేసి వివరాలు ఇవ్వాలని ఏపిఐఐసి జెడ్ఎం, పరిశ్రమల శాఖ జీఎంలను ఆదే శించారు. అలాగే ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అనుమతులు మంజూరు చేసిన పరిశ్రమలు నిబంధనల ప్రకారం కాలుష్య నివారణ, సేఫ్టీ మెజర్స్ తీసుకుంటున్నారా..లేదా అని పరిశీలించాలని, కల్లూరు ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు నీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకో వాలని కమీషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, కమీషనర్ విశ్వనాథ్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఎల్డీఎం రామచంద్రరావు, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, ఎస్సి, ఎస్టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగికి ఘన సన్మానం

**పత్తికొండ, మేజర్ న్యూస్:** పెద్దకడబూరు మండలం,నౌలకల్లు గ్రామానికి చెందిన కేఈ. అయ్యన్న గౌడ్ పత్తికొండ ఆర్టీసీ డిపోలో వెహికల్ డిస్పాచ్ మెకానిక్ గా పనిచేస్తూ.. గురువారం పదవీ విరమణ పొందారు.ఈసందర్భంగా పత్తికొండ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన వీడ్కోలుసభకు ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లప్ప, నేషనల్ మజ్దూర్ యూనియన్‌నాయకులు ఎల్పీశేఖర్, లక్ష్మన్న (రిటైర్డ్)ఆదోని, రీజినల్ కమిటీమెంబర్‌హరిబాబు (కండక్టర్),ఈయూనాయకులు రాజశేఖర్ (రిటైర్డ్),ఈయూ డిపో కార్యదర్శి ఈవీఎంరాజులు హాజరై అయ్యన్న గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేఈ. అయ్యన్న గౌడ్ ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో 36 ఏళ్లపాటు ఎంతో నిజాయితీగా, అంకిత భావంతో తన విధులను నిర్వర్తించారంటూ కొనియాడారు. అంతేకాకుండా అయ్యన్న గౌడ్ సతీమణి కేఈ రాజేశ్వరి కూడా గతంలో ఎంపీపీగా పనిచేశారని, రాజకీయాలలో ఆ కుటుంబానికి అంటూ పత్తికొండలో ఓ ప్రత్యేకతను చాటుకుందని ప్రశంసించారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందన్నారు. అయితే అయ్యన్న గౌడ్ స్థానంలో రెగ్యులర్




వెహికల్ డిస్పాచ్ మెకానిక్ కేఈ. అయ్యన్న గౌడ్ సన్మాన కార్యక్రమ దృశ్యం

ఉద్యోగిని కాకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా వేరే వ్యక్తిని విధుల్లోకి తీసుకున్నా.. ఈయనలాగా సమర్ధతతో పని చేసే వ్యక్తిని మాత్రం మళ్ళీ తెచ్చుకోలేమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కింద అయ్యన్న గౌడ్ సేవలను తిరిగి వినియోగించుకోవాలని పత్తికొండ ఆర్టీసీ డీఎంకు వారు సూచించారు.ఈ కార్యక్రమంలో బంధువులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్దుర్తి ట్రైనింగ్ ఎస్సైగా విద్యాశ్రీ

**వెల్దుర్తి మేజర్ న్యూస్:** వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ట్రైనింగ్ ఎస్సైగా విద్యా శ్రీ నియమితుల య్యారు. గురువారం ఆమె ట్రైనింగ్ పూర్తి చేసుకుని మరికొద్ది రోజులపాటు కర్నూలు జిల్లా, వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ట్రైనింగ్ ఎస్సైగా బాధ్యతలు తీసుకొని ప్రారంభిం చారు. 2024 బ్యాచ్కు చెందిన ఎస్సై విద్యా శ్రీ ఈమె స్వగ్రామం అనంతపురం పట్టణం కాగా 5 నెలల పాటు ప్రొ బెషనరీ పీరియడ్ లో భాగంగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్ కు అలాటు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.




# పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థలో పదవీ విరమణ పొందిన టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సాధిక్ హుస్సేన్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులును మేయర్ బివై రామయ్య, కమీషనర్ పి విశ్వనాథ్ లు సన్మానించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో విరమణ పొందిన ముగ్గురికి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది సాధారణమని, విరమణ పొందిన తర్వాత తమ కుటుంబాలతో సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ ఇజ్రాయిల్, సూపరింటెండెంట్లు రామకృష్ణ, స్వర్ణలత, కుమార్, కార్పొరేటర్లు విక్రమ సింహారెడ్డి, సాంబశివరావు, లక్ష్మీకాంత రెడ్డి, కృష్ణకాంత్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోవాలి : వ్యవసాయాధికారులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** రైతులు కొత్త టెక్నాలజీని ఉపయోగించుకొని నాణ్యమైన పంటను, దిగుబడులు పొందవచ్చునని ఏడీఏ సరళమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని జమ్మినగర్ నందు హేమసుందర్‌రెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని, రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీఏ సరళమ్మ, మండల వ్యవసాయాధికారి స్వాతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ సరళమ్మ మాట్లాడుతూ రైతులకు నానో యూరియా, నానో డీఏపీ, సాధారణ యూరియా, డీఏపీల కంటే ఎంతో ఖచ్చితత్వంతో పని చేస్తాయని రైతులకు వివరించారు. నానో ఎరువుల వాడకం ప్రయోజనకరంగా ఉంటుందని, అన్ని పోషకాలు పిచ్చికారి ద్వారా మొక్కమాత్రమే పీల్చుకుంటుందని, ఫర్టిలైజర్స్ వాడకం వలన భూమికి కలిగే నష్టం, నానో ఎరువులను వాడకంలో భూమికి నష్టం ఉండదని తెలిపారు. నానో డీఏపీ ధర ఒక బస్తా డీఏపీ ధర కంటే తక్కువ అని, నానో ఎరువులను పంట పూత దశకు వచ్చే ముందుకు వాడుకోవచ్చునని, రైతులకు నానో ఎరువులను పంటకు స్ప్రే చేసుకొని కాంప్లెక్స్ ఎరువులను వాడుకోవడం వలన చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. నానో ఎరువులు మండలంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

**– డ్రైనేజీ కాలువల్లో త్రాగునీటి పైప్‌లైన్లను తొలగించాలి**


మాట్లాడుతున్న కమీషనర్ పి విశ్వనాథ్   పాల్గొన్న ఆయా విభాగాల అధికారులు



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో వ్యర్థాల నిర్వహణ(సిఅండ్‌డి వేస్టేజ్)కు తీసుకొచ్చిన నూతన విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి కర్నూలుకు క్లీన్ అండ్ గ్రీన్ పేరు తీసుకొద్దామని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఆగస్టు 1నుండి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నామని, దీనిని అధికారులు, సిబ్బంది సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, ట్రాక్టర్‌కి రూ.500లు, టిప్పర్‌కి రూ.1000లు చొప్పున యజమానులు రవాణ చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటి కోసం ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేస్తామని, ఈ విధానం గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కార్యదర్శులు బృందంగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో సిఅండ్‌డి వేస్టేజ్ నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలో వార్డులకు నోడల్ అధికారులను నియమిస్తామని, వారి ద్వారా వార్డుల్లో అన్ని పనులను పర్యవేక్షించేలా చర్యలను తీసుకుంటామని చెప్పారు. అలాగే డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పీ-4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వామ్యులు కావాలి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**


మాట్లాడుతున్న కలెక్టర్ పి రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పి4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పి4 విధానంపై పరిశ్రమల యాజమాన్యాలు, ఇండస్ట్రియల్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములై అత్యంత పేదలుగా గుర్తించబడిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పి4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదల అవసరాలను బట్టి సహాయం అందించవచ్చని, కుటుంబాలను దత్తత తీసుకోవచ్చని అలాగే సిఎస్‌ఆర్ కింద వెసులుబాటును చేసుకుని ఒక గ్రామాన్ని కూడా దత్తత తీసుకుని గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించవచ్చని వివరించారు. పేదలను ఆదుకునేందుకు ఆయా పరిశ్రమలు యజమానులు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జైరాజ్ ఇస్పాత్, టీజీవి ఇండస్ట్రీస్, రాయలసీమ ఆల్కలీస్, రాజ్ ఇండస్ట్రీస్ తదితర పరిశ్రమల ప్రతినిధులు తమ సమ్మతిని తెలియజేశారు. సమావేశంలో సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, ఏడి భారతి, పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఎల్డీఎం రామచంద్రరావు, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ జశ్వంత్ కుమార్ పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పునఃప్రతిష్ట సందర్భంగా ముఖద్వారం వద్ద విధులు నిర్వహి స్తున్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ జశ్వంత్ కుమార్‌ను మదన భూపాల్ రెడ్డి అను వ్యక్తి ముఖంపై చేతి తోకొట్టి దుర్భషలా డి, విధులకు ఆటంకం కలిగించాడని స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ జశ్వంత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొలిమిగుండ్ల పోలీసు స్టేషన్‌లో మదన భూపాల్ రెడ్డిపై 132 బిఎన్ఎస్, 121(1), 126(2), 351 (2) బిఎన్ఎస్ సెక్షన్ల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న సి.ఐ రమేష్ బాబు

## ఎమ్మెల్యే గిత్త, టీడీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జీ మాండ్రలకు ఘన స్వాగతం



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం, రైతు సేవా కేంద్రం, సచివాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా హాజరవుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలు పారుమంచాల గ్రామానికి చేరుకోగానే మండల అధికారులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత రక్తగ్రూప్ పరీక్షలు


కళాశాలలో రక్తగ్రూప్ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ సిబ్బంది

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు గురువారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 122 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత రక్తగ్రూప్ పరీక్షలను శ్రీ వెంకటేశ్వర ల్యాబ్ ప్యాపిలి వారి సహకారంతో నిర్వహించి, అనంతరం గుర్తింపు కార్డులను అందజేయడం జరిగిందని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరం మన రక్తగ్రూపుల గురించి తెలుసుకోవాలని, రక్త మార్పిడి విషయంలో ఇది చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాదాల సమయంలో రక్తమార్పిడి తగిన రక్తాన్ని ఎంచుకోవడానికి మన రక్త గ్రూపును తెలుసుకోవడం సహాయపడుతుందన్నారు. బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు బాధిత వ్యక్తికి రక్తం ఇవ్వడం వల్ల అతన్ని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్‌పాఠీ, ల్యాబ్ టెక్నిషియన్ కమల్, నాగసాయి, హరి, అధ్యాపకులు రామకృష్ణయ్య, ఓబులేసు, వెంకటరమణ, ముస్తాక్, శంకరయ్య, మద్దిలేటి, వెంకటేశ్వర్లు మురళీమోహన్‌గౌడ్, మంజునాథ్, వన్నూర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కోట్ల సుజాతమ్మ

**డోన్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని స్థానిక జంగాలకాలనీ నందు బాలయ్య కుమార్తె వివాహానికి గురువారం డోన్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ముఖ్య అతిధిగా హజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలు ఇందిరా కోలుకోవాలి


ఉపాధ్యాయురాలిని పరామర్శిస్తున్న డిఈఓ

**కర్నూలు సిటీ , మేజర్‌న్యూస్ :** పాంశాలకు వెళ్లే సమయంలో యాక్సిడెంట్‌కు గురై తీవ్ర గాయాలైన ఎస్‌జిటి ఉపాధ్యాయురాలు ఇందిరా త్వరగా కోలుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆకాంక్షించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను డిఈఓ ఏపిజెఏసి రాష్ట్ర కార్యదర్శి హృదయ రాజుతో కలిసి పరామర్శించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో డిఈఓ మాట్లాడి ఉపాధ్యాయురాలికి ఉత్తమ వైద్యం అందించాలని కోరారు. పాఠశాలకు వెళ్లే సమయంలో ఉపాధ్యాయులు, వారి సహాయకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## శక్తియాప్ పై అవగాహన సదస్సు



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కల్లూరులోని శ్రీ ఆదిత్య విద్యానిలయం పాఠశాలలో గురువారం కర్నూలు శక్తి టీం పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎం బాష, కానిస్టేబుల్ చిన్నరాజులు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మాయిలు, మహిళలు భద్రత గురించి శక్తి యాప్ ఉపయోగాలు, చిన్న పిల్లల వివాహాల గురించి, సైబర్ క్రైం మరియు 112, 118, 1098, 1930గురించి విద్యార్థులకు తెలిపారు. అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కల్లూరు నందు చిన్న పిల్లలకు గుడ్ టచ్..బ్యాడ్ టచ్..గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, టీచర్స్ పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి

**– జిల్లా హౌసింగ్ పీడీ శ్రీహరిగోపాల్**



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** గతంలో మంజూరైన ఇళ్ళ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీహరిగోపాల్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం కోవెలకుంట్లలోని జగనన్న కాలనీలో సిబ్బందితో పాటు కాలనీలలోని ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ బేస్‌మెట్, లెంటల్ లెవెల్‌లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అన్నారు. పనులు చేపట్టకుండా వదిలిపెడితే మంజూరైన గృహాలు రద్దు అవుతాయని, తిగిరి భవిష్యత్తులో బిల్లులు రావని అన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులకు ఈ విషయంపై అవగాహన కల్పించి ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ మద్దిలేటి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



# పుట్టిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు తప్పనిసరి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మాట్లాడుతున్న కలెక్టర్ పి రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పుట్టిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన ప్రసూతి ఆసుపత్రులలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి, పుట్టిన శిశువుల ఆధార్ నమోదు చేయాలన్నారు. 5–15సం॥ల మధ్య ఉన్న పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. పాఠశాలల్లో పిల్లలకు ఆధార్ అప్‌డేషన్‌పై అవగాహన కల్పించి వారికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి బయో మెట్రిక్ చేయించాలని జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. విదేశీయులు, ఎన్ఆర్ఐల ఆధార్ నమోదు విషయంలో క్షేత్రస్థాయిలో కచ్చితంగా తనిఖీలు జరపాలని సూచించారు. ప్రతి మండలంలో కనీసం ఒక ఆధార్ కిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. కోసిగి, కర్నూలు అర్బన్ మండలాల్లో కొన్ని నకిలీ జనన సర్టిఫికేట్లు జారీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని విచారణ చేసి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ప్రతి ఆధార్ కేంద్రంలో సేవల కోసం వసూలు చేసే చార్జీల వివరాలు ప్రదర్శించాలన్నారు. ప్రతి పౌరుడు ఎం–ఆధార్ మొబైల్ యాప్ ఉపయోగించి తన ఆధార్ వివరాలను సురక్షితంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఆధార్ టీం మేనేజర్ యస్.యం జావీద్, యుఐడిఎఐ వారి ఆద్వర్యంలో చేయబోయే అంశాలు, ఆధార్ అప్‌డేషన్ గురించి వివరించారు. సమావేశంలో జిఎస్‌డబ్ల్యుస్ జిల్లా అధికారి, జడ్‌పిసిఈఓ నాసరరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిఎస్ డబ్ల్యుఎస్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఓ భాస్కర్, డిఈఓ శామ్యూల్ పాల్, ఎల్‌డిఎం రామచంద్రరావు, సిఐలు శ్రీధర్, విక్రమసింహా, పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రాఘవేంద్రుడికి బంగారు పల్లకీ సేవ



బృందావనాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం అర్చకులు జయతీర్థస్వామి, శ్రీ మఠం దివాన్ జి.కె. ఆచార్, సహాయ పి.ఆర్.ఓ హొన్నళ్ళి, వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో మృత్తికా బృందావనాన్ని బంగారు పల్లకీలో ఉంచి విశేష పూజలు చేపట్టి, అశేష జనవాహిని నడుమ, భాజాభజంత్రీలు నడుమ, మంగళ వాయిద్యాల నడుమ, భక్తుల నమో రాఘవేంద్ర నామస్మరణతో శ్రీ మఠం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ప్రవచన మండపంలో బంగారు పల్లకీ సేవచేయించిన భక్తుల పేరు, గోత్ర నామాలపై సంకల్ప పూజలు నిర్వహించారు. సేవ చేయించిన భక్తులకు శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం, పుష్ప ఫల, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి, నరసింహా స్వామి, సెక్యూరిటీ సూపర్‌వైజర్ మూర్తి, సురేష్, సెక్యూరిటీ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారాని కై వినూత్న కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న బంగి శ్రీధర్

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈ నెల 5వ తేదీ నుండి 3 రోజుల పాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ గురువారం మీడియాకు వెల్లడించారు. నగరంలోని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగస్తులను ఏకం చేసే విధంగా రండి టీ తాగుదాం..మాట్లాడుకుందాం..సమస్యలను పరిష్కరించుకుందాం..అంటూ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్ రెడ్డి, సిటీ అధ్యక్షులు మురళీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎమ్మెల్యే బీవీ



కేంద్ర మంత్రులతో ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కర్నూలు, నంద్యాల ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరిలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఎమ్మిగనూరుకు ఉన్న రహదారిని జాతీయ రహదారి స్థాయికి మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కర్నూలు నుంచి ఈ రహదారి వ్యవసాయానికి కీలకంగా ఉండడంతో పాటు, మంత్రాలయం, ఆదోని వంటి ప్రధాన కేంద్రాలను కలుపుతుంది. ప్రస్తుతం ఈ రహదారి దుర్గతిలో ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఆటంకంగా మారింది. అత్యవసర వైద్యసేవలందకుండా ఆలస్యం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని తెలియజేశారు. ఈ రహదారి జాతీయ రహదారి స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రాంతీయ అనుసంధానత మెరుగవుతుంది, వ్యవసాయ ఉత్పత్తులు మరియు ఇతర వాణిజ్య సరుకుల రవాణా సులభతరం అవుతుందన్నారు. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు త్వరగా అందించేందుకు వీలవుతుంది. దీనివల్ల ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదపడే అవకాశాలు ఏర్పడతాయని తెలియజేశారు. దానికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే ఈ రహదారిని నిర్మించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు బీవీ తెలిపారు.

# పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమే




ఉద్యోగులను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమేనని వైద్యాధికారులు సురేష్, గోవిందమ్మ, వసంతమ్మలు పేర్కొన్నారు. గురువారం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ వెంకటలక్ష్మీ, పిహెచ్.ఎన్ఏఎం రాణి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. అనంతరం వైద్యులను వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తన పదవీ కాలంలో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రసాద్, మాధవస్వామి, భారతి, గోవిందమ్మ, స్టాఫ్ నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 2.07 లక్షల మంది రైతులకు లబ్ధి

**– ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాయం నుంచి అన్నదాత సుఖీభవ పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 2న అన్నదాన సుఖీభవ పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు ఈ పథకాన్ని సంబంధించి నంద్యాల జిల్లాలో 2.07లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సుఖీభవ పథకం కింద మొదటి విడతలో రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.2వేలు మొత్తం రూ.7వేలు ఒక్కొక్క రైతు ఖాతాకు జమ అవుతాయన్నారు. రైతుల నుంచి ఎటువంటి వ్యతిరేకత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నుదాన సుఖీభవ పథకాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకుని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంటల బీమా ఆగస్టు 15 తేదీ లోపల మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు.



సీఎం సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

పి4 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి :నంద్యాల జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, అన్నదాత సుఖీభవ, స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్, నీటి వనరుల మరమ్మతు, పునరుద్ధరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీన ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈకార్యక్రమానికి సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 15కల్లా నిర్ణీత లక్ష్యాలను అధిగమించి జిల్లాకు మంచిపేరు తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఆగస్టు 1న జిల్లాకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణసభ్యులు పద్మావతి రాక :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి జిల్లాకు విచ్చేస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు బాలల హక్కులు, బాల్య వివాహాలపై గిరిజన, బీసీ, సాంఘిక వసతి గృహ అధికారులు, సహాయ వసతి గృహ అధికారులు, సిడిపిఓలు, డిసిపిఓ, డిసిపియూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు.

# ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని వెంగళాంపల్లె గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ గురువారం పదవీ విరమణ పొందిన సామ్రాజ్యలక్ష్మిని ప్యాపిలి మండల ఎస్‌టియు శాఖ ఆధ్వర్యంలో ఎస్‌టియు నాయకులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

# ఎట్టకేలకు తిరుపతి ట్రైన్ స్టాపింగ్ మంజూరు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలో గుంటూరు – తిరుపతి రైలుకు సంబంధించి కోవెలకుంట్లలో రెగ్యులర్ స్టాపింగ్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ గురు చరణ్‌కు అర్జీ ద్వారా తెలియజేయడం జరిగింది. దీనికి స్పందించిన రైల్వే ఉన్నతాధికారులు కోవెలకుంట్లలో ఆగస్టు 2 వతేదీ నుంచి తిరుపతి ట్రైన్ ఆపేందుకు అనుమతులు ఇస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని, ఇందుకు సహకరించిన రైల్వే స్టేషన్ మేనేజర్‌ను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు సీపీఎం సుధాకర్ తెలిపారు. కోవెలకుంట్లలో తిరుపతి రైలు ఆపేందుకు అనుమతి మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని ప్రజాసంఘాల నాయకులు కరీంబాష, వడ్డె సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, లింగన్న, తదితరులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సుధాకర్ తెలిపారు.

# మున్సిపల్‌లో.. అంతా మా ఇష్టం..!

- చైర్మెన్, అధికారులు, కౌన్సిలర్ల కోసం నిరీక్షణ
- 45 నిమిషాలు కౌన్సిలర్ల ఆలస్యంతో సభ ప్రారంభించిన వైనం
- కౌన్సిలర్ల ప్రశ్నలు
- అధికారుల నిలదీతల మధ్య సభ పరంపర
- కాంట్రాక్టర్ల బిల్లు పై దృష్టి సారించాలి
- మున్సిపల్ ఛైర్మెన్ లోకేశ్వరీ


హాలులో చర్చలు జరుపుతున్న సభ్యులు


అధికారులను నిలదీస్తున్న వైస్ చైర్మన్లు

**ఆదోని, మేజర్ న్యూస్ :** నిన్న.. నేడు.. రేపు కూడ మాకు తెలియకుండా ఏ ఒక్క పని జరగడానికి వీలు లేదు. మున్సిపల్‌లో అంతా మా కన్నుసన్నుల్లో జంగాలి, మా ఇష్టానుసారంగా అధికారులు ఇక అధికారం మారిందని. వైసీపీ ఓడిందని. అధికారులు ఎవ్వరికి ఇష్టం వచ్చినట్లు వారు చేస్తే.. మేము చూస్తూ మాత్రం గమ్మున ఉండేది లేదంటూ, కౌన్సిలర్లు సూటిగా అధికారులను హెచ్చరించిన ఘటన సమావేశంలో జరిగినంత పనైంది. ఆదోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సభకు చైర్మన్ సి.హెచ్ లోకేశ్వరి అధ్యక్షత వహించారు. అయితే అజెండాలో పేర్కొన్నట్లు సభ సమావేశం 11గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అందుకు సన్నద్ధమైన మహిళా కౌన్సిలర్లు సమయానికి కోరంకు సరిపడే సభ్యులు సభలో కూర్చున్నారు. ఇద్దరు వైస్ చైర్మన్లు, మిగిలిన సభ్యులు మీటింగ్ హాలు బయట సుదీర్ఘ చర్చలు అనంతరం సభలో ప్రవేశించారు. అక్కడితో ఆగకుండా కౌన్సిల్ సమావేశంలోనే ముఖ్య కౌన్సిలర్లు గుంపు గూడి సభ సమావేశంలో చర్చలు జరిపి సుమారు 45నిమిషాలు ఆలస్యంగా సభను ప్రారంభించారు. అప్పటిదాక రావాల్సిన కౌన్సిలర్ల సభ్యులకోసం చైర్మన్, కమీషనర్, మిగిలిన సహా ఉద్యోగులు రానివారికోసం మనస్సులో మదన పడుతూ.. తెగేసి చెప్పలేక.. సభ ప్రారంభం కోసం గమ్మున ఉండిపోయారు. సమావేశం ప్రారంభం కాగానే.. టీడ్కో ఇండ్ల లబ్దిదారులను మరో కౌన్సిలర్ ఏకంగా సమావేశంలోపలకే బాధితులను తీసుకొచ్చారు. బాధితులు టీడ్కో ఇండ్ల పంపిణీ, బ్యాంకురుణం, ఇంటి కోసం 2017లో డిడిల రూపంలో ఒక్కొక్కరు రూ. 50వేలు, రూ.లక్ష చెల్లించి, సంవత్సరాలు గడిచినా ఇండ్లు ఇవ్వలేదని వారి సమస్య వినిపించారు. ఇల్లు ఇవ్వకపోగా బ్యాంకుల నుండి ఇండ్ల కోసం ఇచ్చిన రుణాలను చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చి తమను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బోరమన్నారు. ఇప్పటికైనా అధికారులు టీడ్కో ఇండ్లపై దృష్టి సారించి ఇండ్లు ఇవ్వడమా...? లేదా కట్టినడబ్బులు తిరిగి ఇవ్వడమా..? బ్యాంకు నోటీసుల బారి నుండి తమను ఆదుకోవాలని చైర్మన్ లోకేశ్వరిని కోరి వినతిపత్రం అందజేశారు. ఈ తథంగమంతా చూసిన మున్సిపల్ కమీషనర్ కృష్ణ తన కూర్చీ నుండి లేచి చైర్మన్ వద్దకెళ్ళి మైకు తీసుకున్నారు. టీడ్కో ఇళ్ల బాధితుల సమస్య న్యాయమైందే.. కౌన్సిల్ సమావేశంలో రావడం సరైంది కాదని తప్పు పట్టారు. బాధితుల సమస్య ఏమైనా ఉంటే నేరుగా చైర్మన్, కమీషనర్ రూమ్ వద్ద కలిసి చెప్పుకోవాలే తప్ప.. నేరుగా కౌన్సిల్ హాలులోకి రావడం సబబు కాదని హెచ్చరించినంత పని చేశారు. బాధితుల సమస్యను విన్న అధికారులు టీడ్కో ఇండ్ల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. కాబట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చి తిరిగి పంపించారు. అనంతరం 37అంశాలతో కూడ అజెండాను చదివి వినిపించారు. అజెండాలో ని అంశాలు ఎస్ఎస్ ట్యాంకు మరమ్మత్తులు, చనిపోయిన పిహెచ్ వర్కర్ల కుటుంబ సభ్యుల నియామకం, కుక్కల బెడద, షాపు రూంల రెన్యూవల్ తదితర అంశాలపై వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ఫయాజ్, బాలాజీలు పై అంశాల గురించి సమాచారం ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. ఎస్ఎస్ ట్యాంకు శిథిలావస్థలో ఉన్నప్పటికీ తమకు సమాచారం ఇచ్చి పరిశీలనకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై లేదా అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం మరమ్మత్తుల కోసం అజెండాలో అంశాన్ని పొందు పరిచి ఆమోదించాలంటూ మాముందు పెట్టడం ఏమిటని డి.ఈ చలాపతిని నిలదీశారు. ముందుగా కౌన్సిలర్లను గౌరవించుకోవడం నేర్చుకోవాలని అన్న మాట అధికారులకు చురకలు పెట్టినంత పనిచేసింది. ఇదే అధికారులు శాసనసభ్యులు పిలిస్తే.. చంకన బుక్కులు పెట్టుకొని పరుగులు తీస్తున్నారు. అయితే మేము పిలిస్తే మాత్రం మున్సిపల్ కార్యాలయంలో అటెండర్లు కూడ మా వద్దకు రాని దుస్థితి నెలకొందని వైస్ చైర్మన్ నరసింహులు ఆవేదన వ్యక్తం చేసి వారి పనితీరును తప్పు పట్టారు. శాసనసభ్యులను గౌరవించినట్లే కౌన్సిలర్లను కూడ గౌరవిస్తూ, మున్సిపల్ కార్యాలయంలో చేసే ప్రతి అభివృద్ధి పనిలోను సభ్యులను బాగస్వాములు చేసే బాధ్యత అధికారులు, చైర్మన్ తీసుకోవాలని హితవు చేశారు. మరోసారి ఇలా జరగడానికి వీలు లేదన్నారు. ఎమ్మెల్యే మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు తీసుకొస్తున్నాని ప్రగల్బాలు పలికాడన్నారు. ఇది ప్రజలకు తెలియాలన్న ఉద్దేశ్యంతోనే కౌన్సిల్ సమావేశంలో అంశంపై చర్చ జరుపుతున్నామని పేర్కొన్నారు. ఎస్ఎస్ ట్యాంకు మరమ్మత్తులకు సుమారు రూ. 70కోట్లు ఖర్చు అవుతున్నట్లు అధికారుల అంచనా ఉందన్నారు. పనిని ప్రారంభించేందుకు డిపిఆర్ తయారు చేస్తే మున్సిపల్ కార్యాలయం నుంచి ఒక శాతం డబ్బును జనరల్ ఫండ్ నిధుల నుండి చెల్లించాల్సి ఉందన్నారు. అలాంటప్పుడు అభివృద్ధికి కౌన్సిలర్లు అడ్డు పడుతున్నారని ఎమ్మెల్యే అనడం ఏమిటన్నారు. వైస్సార్సిపి మాజీ శాసనసభ్యులు కూడ పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు తోడ్పాటు ఇవ్వాలని దిశ నిర్దేశం చేశారన్నారు. ప్రభుత్వం ఏదైనా.. శాసనసభ్యులు ఏ పార్టీ వారైనా ఆదోని నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా కౌన్సిలర్లు అడుగులు వేయడమే కర్తవ్యమన్నారు.

# మనసున్న మారాజు మంత్రి బి.సి

- గాయపడ్డ వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించిన మంత్రి బి.సి



**దొర్నిపాడు,మేజర్, న్యూస్ :** రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మరియు మౌళిక వసతుల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి మరోకమారు మనసున్నమారాజు అని మరోసారి నిరూపించుకున్నారు. వివరాల్లోకి వెలితే ఆళ్లగడ్డ నియోజకవర్గ కార్యక్రమంలో పాల్గొనడానికి వెలుతుండగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు మండల కేంద్రంలో మెయిన్ రహదారి మీద మోటారు వెహికల్ ప్రమాదం అయి రోడ్డుమీద పడి ఉన్న యువకుడిని గుర్తించి వెంటనే కాన్వాయ్ ఆపి ఆటోను పిలిపించి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని మంత్రి బి.సి ఆదేశించారు. గాయపడ్డ వ్యక్తి వెంట వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో దగ్గరుండి చేర్పించి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి గాయపడ్డ బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాద ఘటన చూసిన వెంటనే మంత్రి కాన్వాయ్ ఆపడం ఆయన స్పందించిన తీరు బాధితుడికి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడం ప్రత్యక్షంగా చూసిన స్థానికులు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# రీసర్వే ప్రాజెక్టుపై గ్రామాల విఆర్ఓలకు, అధికారులకు శిక్షణ - సబ్ కలెక్టర్



**ఆదోని, మేజర్ న్యూస్ :** రీసర్వే ప్రాజెక్టుపై 62 గ్రామాల విఆర్ఓలకు, అధికారులకు శిక్షణ నిర్వహించినట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రీసర్వే పనులపై ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్ (ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులకు శిక్షణ కార్యక్రమం సబ్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, రీసర్వే ద్వారా గ్రామాల భూ సరిహద్దులను సరిచేసి ప్రజలకు పారదర్శకమైన భూ రికార్డులు అందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణ పొందిన అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి సర్వే ప్రక్రియలో సహకారం పొందాలన్నారు. ఈ ప్రాజెక్ట పూర్తయ్యాక భూ వివాదాలు తగ్గి శాశ్వతమైన భూ పత్రాలు అందుతాయని వివరించారు.

# తెలుగుదేశం పార్టీ అంటేనే రైతుల, ప్రజల ప్రభుత్వం

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అన్ని అమలు
- అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అజెండా
- ఆరోగ్య ఉపకేంద్రం, రైతు సేవా కేంద్రం, సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డి


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిత్త, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అంటేనే రైతుల సంక్షేమం, బడుగు, బలహీన వర్గాల పేద ప్రజల సంక్షేమ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వమని నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శివానందరెడ్డిలు అన్నారు. జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం, రైతు సేవా కేంద్రం, సచివాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్త, నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్రలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు పారుమంచాల గ్రామం చేరుకోగానే మండల అభివృద్ధి అధికారి గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా ఆహ్వానం పలికా రు. ముందుగా ఆరోగ్య ఉపకేంద్రాన్ని, ఆరోగ్య ఉపకేంద్ర శిలాఫలకంకు రిబ్బన్ కత్తిరించి ఎమ్మెల్యే గిత్త జయసూర్య, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలు ప్రారంభించారు. అదే మాదిరిగా రైతు సేవా కేంద్రాన్ని, గ్రామ సచి వాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త, మాండ్రలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి ంచి సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తూ 80 శాతం హామీలను నెరవేర్చామని అన్నారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, అలాంటి స్థితిలో నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ ప్రజలకు కావాల్సిన సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని వారు అన్నారు. అదికారంలోకి రాగానే రూ. 2.50 కోట్లతో 36 సీసీ రోడ్ల పనులు పూర్తి చేయడం, 50 మినీ గోకులాలు నిర్మించడం, ఇలా అభివృద్ధిలో ఎన్నికల్లో హామీ ఇచ్చిన వాటికంటే ఎక్కువగా అమలు చేస్తూ రైతుల కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిత్యం ముందుండే ప్రభుత్వం ఏదైనా ఉందంటే సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వానిదేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, డీసీసీ కమిటీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గిరీశ్వర్‌రెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచ్ రవికాంత్, వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, శేఖర్ గౌడ్, ఈదుల నారాయణరెడ్డి, తత్తూరు దేవాలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, దొరబాబురెడ్డి, దేవసహాయం, రసూల్, రావూఫ్, మహిళా నాయకురాలు ప్రసన్న లక్ష్మి, ఎంపీటీసీ నీలమ్మ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, జమీల్‌బాష, నందికోట్కూరు సోసైటీ చైర్మన్ ముర్తుజావలి, పగిడ్యాల, మిడ్తూర్ మండల కన్వీనర్లు మహేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి, నాగిరెడ్డి, షాలుబాష, వెంకటరెడ్డి, హుసేనయ్య, సంజన్న, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, డీఈ రామ్మోహన్, వైద్యాధికారులు యశశ్విని, మౌనిక, మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి, ఏపీఎం అంబమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, పీఆర్ఏఈ బషీర్, ఆయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం

## బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్

**బండి ఆత్మకూరు రూరల్,మేజర్ న్యూస్ :** మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ విద్యార్థులకు సూచించారు.గురువారం సంత జూటూరు జెడ్పిహెచ్ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగం అనర్థాలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాలు వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.విద్యా ర్థులు సిగరెట్ తాగడం,మద్యం తీసుకోవడం ఫ్యాషన్ గా అనుకుంటు న్నారని అది వినాశనానికి దారితీసి జీవితం నాశనం చేస్తున్నదన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జగన్మోహన్

# వెల్దుర్తి బాలికల వసతి గృహంలో సీట్లు పెంపు

**వసతుల కల్పనకై ఎమ్మెల్యే కే.యి. శ్యాంబాబు ని కలిసిన వసతి గృహ అధికారిణి గిరిజా దేవి**

**వెల్దుర్తి ,మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా, మండల కేంద్రమైన వెల్దుర్తి లోని బీ.సి. బాలికల వసతి గృహం కర్నూలు జిల్లాలోనే ఉత్తమ వసతి గృహంగా పేరు తెచ్చుకున్న విషయం తెలిసిందే.అంత మంచి పేరు రావడంతో వసతి గృహంలో రైతులు, రైతు కూలీల పిల్లలు జిల్లా నలుమూలల నుండి వచ్చి వసతి గృహంలో చేరి విద్యను అభ్యసించడానికి అత్యంత ఆసక్తి చూపుతున్నారు. అందువలన వసతి గృహంలో దాదాపుగా



750 మంది దాకా విద్యార్థినిలు ఉండడంతో వారికి గదులు కొరతా మరియు మంచి నీటి కొరత,అనేక ఇబ్బందులు వస్తున్నాయి. ఎంతోమంది ఇంకా ఈ హాస్టల్‌లో చేరడానికి ఆసక్తి చూపుతుండంతో సీట్ల కొరత కూడా ఏర్పడింది. ఈ విషయాలన్నీ పత్తికొండ ఎమ్మెల్యే కే.యి శ్యాంబాబు ను నేడు వసతి గృహాధికారిణి గిరిజా దేవి పత్తికొండలో ఆయన నివాసంలో కలిసి వసతి గృహ సమస్యలన్నిటిని ఆయనకు కులంకషంగా వివరించారు. కె.యి. శ్యాంబాబు ఈ సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెల్దుర్తి లోని పలు ప్రజాసంఘాలు కూడా వసతి గృహ సమస్యలను పరిష్కరించి మరిన్ని సీట్లను పెంచాలని ఎమ్మెల్యే కె శ్యామ్ బాబును అభ్యర్థిస్తున్నారు.

# అంతర్జాతీయ బాక్సింగ్ విజేతలకు అభినందన

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** జూలై 24 నుండి 28వ తేదీ వరకు నేపాల్ లోని పోఖారాలో జరిగిన ఐదవ ఇండో-నేపాల్ అంతర్జాతీయ ఆహ్వాన బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన 11 మంది బాక్సర్లు వివిధ వెయిట్ కేటగిరీలలో బంగారు పతకాలు సాధించారు.ఈ సందర్భంగా నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి. రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఫయాజ్ లు క్రీడాకారులను, కోచ్ ఆనంద్ ఆచారిని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ బాక్సింగ్ లో అంతర్జాతీయ పోటీలలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు విజేతలుగా నిలవడంలో విశేష కృషిచేసిన బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్, కోచ్ ఆనందాచారి లను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో బాక్సింగ్ క్రీడ అభివృద్ధికి, విద్యార్థులలో,యువతలో బాక్సింగ్ క్రీడ పట్ల ఆసక్తి పెంచడానికి శిక్షణ శిబిరాలు, టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్,నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు,కళారాధన నిర్వాహక కార్యదర్శి రంగనాథ్, నంద్యాల జోన్ బాక్సింగ్ ఇంచార్జ్ సర్దార్ ఖాన్, షానవాజ్, పతకాలు సాధించిన క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.పతకాలు సాధించిన క్రీడాకారులు: మహేష్,వంశీ, జగదీష్, ప్రసాద్ నాయక్,తిరుమలేష్ సీనియర్ విభాగంలో, జూనియర్ విభాగం లో జస్వంత్ గౌడ్,విష్ణు,సిద్ధార్థ, సబ్ జూనియర్ విభాగంలో చరణ్ తేజ్ రెడ్డి, కళ్యాణ్ కృష్ణ, తోషన్ నాయుడు వివిధ వెయిట్ కేటగిరిలలో విజేతలుగా నిలిచారు.

# ప్రతిఒక్కరు సొంతింటి కలను నెరవేర్చుకోవాలి

**:- వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి**
**:- రాజన్న సేవలను గుర్తు చేసుకున్న స్థానిక వైకాపా నాయకులు**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రతిఒక్కరు సొంతింటికలను నెరవేర్చుకోవాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి అన్నారు. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన వైకాపా సర్పంచ్ విరుపాక్షి రెడ్డి తమ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది ప్రతిఒక్కరి కల అని, జీవితంలో ప్రతిఒక్కరు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. సొంతింటి కల పేదలకు భారం అవుతుందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిఒక్కరికి ఇల్లు నిర్మించి ఇచ్చాడని, రాజన్న రాజ్యంలో ఇల్లు లేని వారికి ఇళ్లను నిర్మించి మన రాష్ట్రంలో కొన్ని లక్షల ఇళ్లను పేదలకు అందించిన ఘనత రాజశేఖర్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు హలిగేర కేశం వెంకటరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, సర్పంచ్ వెంకట రామ్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, ఎంపిపి ఈసా, ఎంపిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రామిరెడ్డి, కొత్తూరు మల్లికార్జున రెడ్డి, కురువ రంగస్వామి, యాటకల్లు శ్రీనివాస రెడ్డి, రవికుమార్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, మల్లి, శేషప్ప, శ్రీనివాసరెడ్డి, తిరుమల రెడ్డి, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాక్సింగ్ ఛాంపియన్ కు వెల్దుర్తిలో ఘనస్వాగతం

**గోల్డ్ మెడల్ సాధించిన ఎరుకలి మహేష్**
**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:**

ఈనెల 24 వతేదీ నుంచి 27వ తేదీ వరకు నేపాల్ దేశం పోబర సిటిలో జరిగిన ఇండో-నేపాల్ ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్-2025 లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,కర్నూలు జిల్లా, వెల్దుర్తి పట్టణానికి చెందిన ఎరుకలి మహేష్ ,కోచ్ ఫయాజ్ కు మహేష్ తల్లిదండ్రులు ఎరుకలి మద్దిలేటి ఎరుకలి జ్యోతి దంపతులు,పట్టణ వాసులు, సీపీఐ నాయకులు, కుటుంబ సభ్యులు పెదనాన్న ఎరుకలి నాగరాజు ఎరుకలి ఎల్లప్ప, మరియుబంధు మిత్రులు గురువారం వారికి వెల్దుర్తి పట్టణంలో ఘనస్వాగతం పలికారు. బాక్సింగ్ ఛాంపియన్ పట్టణానికి చేరుకున్న విజేతను,కోచ్ ఫయాజ్ కు ముందుగా పూలమాలలతో ముంచెత్తి ఆనంద వ్యక్తం చేశారు. బజాజ్ షోరూం నుండి పట్టణ పురవీధుల గుండా బాణా సంచా పేలుస్తూ, ఘనంగా ఊరేగించారు. పాత బస్టాండులో తెలుగుతల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన సందర్భంగా విజేత కోచ్ (కర్నూలు ఏబీబాక్సింగ్ అకాడమీ కోచ్) ఫయాజ్ మాట్లాడుతూ విజేత ఎరుకలి మహేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసుకున్నాడన్నారు. విద్యార్థి దశ నుంచే అతనికి బాక్సింగ్ పట్ల ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకున్నాడన్నారు. గతేడాది జూలైలో జాతీయ స్థాయిలో చెన్నై నెహ్రూ స్పోర్స్.కాంప్లెక్సో నిర్వహించిన సౌత్ జోన్ బాక్సింగ్ (80-86 కేజీల యూత్ కేటగిరి)ఛాంపియన్షిప్లోను సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో85 కేజీల యూత్ కేటగిరి విభాగంలో యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోషియేషన్ ఆఫ్ఇండియా, నేపాల్ యూత్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఛాంపియన్ షిప్లో 8 దేశాల బాక్సర్లు పాల్గొన్నారన్నారు.ఇండియా నుంచి ఎరుకలి మహేశ్ ఫైనల్ కు ప్రవేశించి నేపాల్ కు చెందిన ప్రత్యర్థిని మట్టికరిపించి విజేతగా నిలిచాడన్నారు. విజేత మహేశ్ మాట్లాడుతూ తన విజయానికి కోచ్ ఫయాజ్ తల్లితండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహమేనన్నారు. ఒలంపిక్స్, ఇతరత్రాఅంతర్జాతీయ పోటీలలో పాల్గొని, మెడల్స్ సాధించి, దేశానికి, పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నదే తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఎరుగలి నాగరాజు, ఎల్లప్ప ,వెంకటేశ్వర్లు, ఈరన్న, విజేత కుటుంబ సభ్యులు,సిపిఐ మండల కార్యదర్శి టి. కృష్ణ, చిన్నమాదులు, శివ, మధు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బాక్సింగ్ ఛాంపియన్ కు, కోచ్ ఫయాజ్ కు కృతజ్ఞతలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు

# కొత్తగా 84 స్పౌస్ పెన్షన్లు మంజూరు

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :**
కృష్ణగిరి మండలంలో అదనంగా 84 స్పౌస్‌పింఛన్లను మంజూరు చేస్తూ నిధులు విడుదల అయ్యాయని మండల పరిషత్ కార్యాలయం ఈఓ ఎస్.రామస్వామి తెలిపారు.మండలం మొత్తం మీద 4,475 పింఛన్లలో అదనంగా 84 స్పౌస్ పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.ఇటీవల పింఛన్‌దారుల్లో మృతి చెందిన వారి స్థానంలో కొత్తగా 84 పింఛన్లను అందజేస్తామన్నారు.మృతి చెందిన వారి భర్త స్థానంలో ఆయన భార్యకు, భార్య స్థానంలో భర్తకు పింఛన్ల పంపిణీ చేస్తామని ఈఓ ఎస్.రామస్వామి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా సుమిత్ర



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా దాసరి సుమిత్ర ఎన్నికయ్యారు. నంద్యాల లోని జ్ఞానాపురం కు చెందిన దాసరి సుమిత్రను పీసీసీ అధ్యక్షురాలు వై.యస్. షర్మిల ఆదేశాల మేరకు నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ ఆమెను నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా సుమిత్ర మాట్లాడుతూ జిల్లాలో మహిళలను కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షురాలు వైస్ షర్మిల, జిల్లా అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ కు సుమిత్ర కృతజ్ఞతలు తెలియజేశారు.

# మండలంలో కొత్తగా 88 స్పౌస్ పెన్షన్లు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ విధానంలో గత నవంబర్ నెలలో మార్పులు చేసింది. అందులో భాగంగా పెన్షన్ తీసుకుంటున్న భర్త మరణిస్తే ఆ మరుసటి నెలలో భార్యకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.మండల వ్యాప్తంగా భర్తలుచనిపోయి పెన్షన్ ఆగిన వారి జాబితా 88కాగా వీరికి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.ఆగష్టు నెలకు సంబందించిన పెన్షన్ పంపిణీ వీరితో పాటు పంపిణీ చేస్తునట్టు ఎంపీడీఓ రాణెమ్మ పేర్కొన్నారు.

## రహదారుల అభివృద్ధి పనులపై మంత్రి బి.సి సమీక్షా సమావేశం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బుధవారంనాడు ఒంటిమిట్ట జాతీయ రహదారులు అభివృద్ధి పనులపై ఎన్.హెచ్.ఎ.ఐ తిరుపతి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశంతో సమీక్షా సమావేశం రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మరియు మౌళిక వసతుల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరిగతిన పూర్తి చేయాలని ఎన్.హెచ్ అధికారులకు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.



ఎన్.హెచ్ అధికారులతో చర్చిస్తున్న మంత్రి బి.సి

# ఘనంగా గంజహళ్లి బడేసాహెబ్ పెద్దఉరుసు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** గంజహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి వారి పెద్ద ఉరుసు మహెూత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు స్వామి వారి గంధంతో మేళతాళలతో ఉరేగింపుగా దర్గాను చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాదికి భక్తితో గంధం పట్టించారు. సమాదిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పీఠాధిపతుల ఇంటి నుంచి గంధంను దర్గాకు తీసుకువెలుతున్న మార్గంలో భక్తులు పీఠాధిపతులను ప్రత్యేకంగా పూలు, జలం, అత్తరుతో పూజించారు. స్వామివారి ఉరుసు సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## కార్పోరేట్ విద్యారంగానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** కార్పోరేట్ విద్యారంగంకు వ్యతిరేఖంగా ప్రతి విద్యార్థి పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు మునిస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని మోడల్ స్కూల్ నందు ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రయోజనం కోసం విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని, విద్యార్థులకు విద్యను భోదించకుండా కాశాయి విద్యావిధానాన్ని అమలు చేస్తున్నారని వారు ఆరోపించారు. వాటిని తిప్పి కొట్టడానికి విద్యార్థులు ఎకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్సార్, భాష, సమీర్, అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం..టిడిపి నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్ః** కూటమి ప్రభుత్వంతోనే ఆంద్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమౌతుందని టిడిపి నాయకులు అన్నారు. డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలోని గుత్తి రోడ్డు నందు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి రోడ్డులోని ప్రతి షాప్‌కు తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు కరపత్రాల రూపంలో వివరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భార్యాభర్తలిద్దరికీ సన్మానం



భార్యాభర్తలను సన్మానించిన ఉద్యోగులు, సిబ్బంది

**వెల్దుర్తి,మేజర్‌న్యూస్‌:**మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి, కార్యనిర్వహణ ఇంజనీరింగ్ పదవీ విరమణ పొందిన భర్త జింక వేణుగోపాల్ భార్య భర్తలు ఒకేరోజు పదవీ విరమణ పొందడంతో, వారిని వెల్దుర్తి ప్రాజెక్ట్ డైరెక్టర్ లుక్ ఆధ్వర్యంలో గురువారం ప్రాజెక్ట్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ఘనంగా పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ లుక్ మాట్లాడుతూ 40 సంవత్సరాల నుండి మహిళా శిశుసంక్షేమ వివిధ పదవుల నుంచి ఉన్నత పదవికి అవరోధిస్తూ 40 సంవత్సరాలు పూర్తి చేసుకొని పదవీ విరమణ చేస్తున్న ఇరువురికి సహ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలకడం జరిగిందన్నారు. వెల్దుర్తి మహిళ శిశు సంక్షేమ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఈ- పంట నమోదు చేసుకోవాలి



**గడివేములమేజర్ న్యూస్:** మండలంలోని గని గ్రామంలో రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని విలేజ్ హార్టికల్చర్‌అసిస్టెంట్‌సుబేతుల్లా అన్నారు. గని గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన పంటలను విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌ఎస్ .సుబెతుల్లా (మున్నా) తలారి తో కలిసి ఈ పంట నమోదు చేశారు. ఈ సందర్భంగా సుబేతుల్లా మాట్లాడుతూ ప్రతి రైతుకచ్చితంగా ఈ పంట నమోదు చేసుకోవాలని ఈ పంట నమోదు చేసుకుంటేనే పంటల బీమా, పంట నష్టపరిహారాలు, మరియు పంట ధర లేనప్పుడు ప్రభుత్వానికి మద్దతు ధర పంటలు అమ్ముకోవడానికి వీలు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు తలారి పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆళ్లగడ్డ విద్యుత్ ఏడిఈ సుబ్రమణ్యం**



పాంప్లెట్లును విడుదల చేస్తున్న అధికారులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ప్రధానమంత్రి సూర్యఘర్ సౌర విద్యుత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనిఏపీఎస్పీడీసీఎల్ ఆళ్లగడ్డ ఏడిఈ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండలం శాంతినగరం గ్రామంలో గురువారం సాయంత్రం పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామస్తులు తమ ఇంటిపై సౌర పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా రూ.78,000 సబ్సిడీ లభిస్తుందని వివరించారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి గోపాల్, ఎంపీడీవో నూర్జహాన్, మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, ఆళ్లగడ్డ విద్యుత్తు ఏఈ కృష్ణయ్య, ఎర్రగుంట్ల ఎస్బిఐ మేనేజర్ నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న లంగ్స్ క్యాన్సర్ బాధితులు

**:- డాక్టర్. పొట్టి వెంకట చలమయ్య, కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, కర్నూలు..**



డాక్టర్. పొట్టి వెంకట చలమయ్య

**కర్నూలు, మేజర్ న్యూస్ :** లంగ్స్ క్యాన్సర్ బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారని కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ పొట్టి వెంకట చలమయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్ రావడానికి గల కారణాలు, నివారణ చర్యలు, తీసుకునే చికిత్సలపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం అగష్టు 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగాఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్యాన్సర్లలో ప్రధానమైనది. రొమ్ము, పెద్దప్రేగు మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ల కంటే సంవత్సరానికి ఎక్కువ మంది ఈ క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి సంవత్సరానికి సుమారు దేశంలో 70,000 మరణాలకు ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణం.నివారించగల వ్యాధి. దీనిపై విస్తృత్తమైన అవగాహన ప్రజల్లో కల్పించాలన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స ఆ క్యాన్సర్ దశపై ఆధారపడి ఉంటుందన్నారు. శస్త్రచికిత్స, కెమోథెరపీ మరియు రేడియో థెరపీ వివిధ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని, దీని నివారణకు మీరు ధూమపానం మానేస్తే మీ ప్రమాదాన్ని తగ్గించవచ్చునన్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుందన్నారు. ధూమపాన నివారణ కోసం నికోటిన్ ఉత్పధాక స్థాపన ఉత్పత్తులు, మందులు మరియు సహాయక సమూహాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు.

# రైతు సదస్సును జయప్రదం చేయండి.. సిపిఎం



**తుగ్గలి, మేజర్ న్యూస్:** నియోజకవర్గమైన పత్తికొండలో ఆగస్టు నాలుగున జరుగుతున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ గురువారము మండల కేంద్రమైన తుగ్గలిలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు తప్పకుండా మాజీ శాసనసభ్యులు దివంగత నేత ఈశ్వర్ రెడ్డి 46వ వర్ధంతి సందర్భంగా సాగు రైతులకు సౌకర్యాలను కల్పించాలని కోరుతూ రైతు సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రైతు సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై రైతు సమస్యలను విన్నవించాలని ఆయన కోరారు. దివంగత నేత ఈశ్వర్ రెడ్డి చేసిన సేవలు ఎన్నటికీ మరవరాని ఉన్నారు. భూస్వాముల కబంధహస్తాల్లో ఉన్న భూములను పేద రైతులకు పంపించిన ఘనత ఈశ్వర్ రెడ్డి కి దక్కిందన్నారు. ముఖ్యంగా రైతుల సమస్యలపై పోరాడ గలిగిన వ్యక్తి ఆయనే అన్నారు. అందుకే నియోజకవర్గమైన పత్తికొండలో ఈశ్వర్ రెడ్డి భవన్లో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు అధిక సంఖ్యలో రైతులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర నాయకులు మణిరెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం నియోజకవర్గంలోని హాస్టళ్లను సందర్శించి హాస్టల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రారంభంలో కూటమి ప్రభుత్వం అందజేసిన బ్యాగులు చినిగిపోయి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు దయ్యాల మహబూబ్, నాగేంద్ర, నాగన్న, రామకృష్ణ, గౌతమ్, రాజ్, నరసింహాచారి, త ది త ర ు ల ు పాల్గొన్నారు.



# సమస్యలపై ఏకరువు పెట్టిన కౌన్సిలర్లు..!


**-పదవి కాలం దగ్గర పడుతున్నా.. వార్డుల్లో పనులు పూర్తి కావడం లేదంటున్న కౌన్సిలర్లు**
**-బిజేపీలో చేరిన కౌన్సిలర్‌కు ప్రత్యేక సీటు కేటాయించండి**
**-శివ సర్కిల్లోనే జాతీయ జెండాను పెడుతున్నాం :- కమిషనర్ స్పష్టం**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మున్సిపల్‌కౌన్సిల్‌సమావేశంలో కౌన్సిలర్లు సమస్యలపై ఏకరువు పెట్టారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెయస్ రఘు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం ఆయా వార్డుల కౌన్సిలర్లు తమతమ వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముందుగా 1వ వార్డు కౌన్సిలర్ నాగేశప్ప మాట్లాడుతూ పట్టణంలో జాతీయ జెండా ఏర్పాటు మంచి ఉద్దేశమే కానీ ఎమ్మిగనూరు ప్రధాత పద్మ శ్రీ మాచాని సోమప్ప కూడలిలో ఏర్పాటు చేయాలన్న నిర్ణయం సరైంది కాదన్నారు. ఈ విధంగా జరిగితే భవిష్యత్తు లో సోమప్ప సర్కిల్ జెండా సర్కిల్ గా మారుతుందన్న విషయాన్ని ముక్తకంఠంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నామన్నారు. కావున ఎమ్మిగనూరుప్రతిష్టను దశదిశలా చాటిన మాచాని సోమప్పకు సముచిత స్థానం ఇవ్వగలరని కోరారు. అటు తరువాత బిజేపీ ఫిరాయింపు కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ పట్టణంలో 34 వార్డులో సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తానని అనడంతో పలువురు కౌన్సిలర్లు అడ్డు తగిలారు. ఆ సమయంలో టీడీపీ కౌన్సిలర్ ఇస్సాక్ మాట్లాడుతూ టీడీపీ సంఖ్యా బలం పెరుగిందని బిజేపీ లోచేరినకౌన్సిలర్ దయాసాగర్ కూటమి పేరుతో స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డిని కలువకుండా కూటమి ఏమిటి అంటూ ఆయకు తమతో కాకుండా ప్రత్యేక సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదం జరిగింది. ఇంతలో 22,



పలు సమస్యలపై సమాధానం ఇస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

28, 14, 9, 6 వార్డు కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, బోయ బజారి, ఖాసీం బేగ్, రాజరత్నంలు మాట్లాడుతూ అధికారులు చక్కగా పని చేస్తున్నారని ఛైర్మన్ కితాబు నివ్వటం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా వెంటపురం, వీవర్స్ కాలనీలో, గాంధీనగర్, ఖభరస్తాన్ కొట్టాల, గూడూరు బైపాస్, మహబూబ్ నగర్ కాలనీ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్డు సౌకర్యం, వీధి దీపాలు లేక కౌన్సిల్ అధికారంలోవచ్చి నప్పటి నుండి ప్రతిపాదనలు పెట్టినా, టెండర్లు పూర్తి అయినా పనులు కావడం లేదని పరిస్థితి అర్థం కావడం లేదని వాపోయారు. అలాగే కౌన్సిలర్ దయసాగర్ మాట్లాడుతూ మక్కామసీద్ దగ్గర తాగునీటి సమస్యలనుతీర్చాలని,ప్రధాన రహదారులు మరమత్తులకు గురైన వాటిని పూర్తిచేయాలని, మైనార్టీ స్మశాన వాటిక దగ్గర సిసి రోడ్లు వేయాలని, పలు ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా లేవని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. రెండవ వైస్ ఛైర్మన్ దివ్యకళ మాట్లాడుతూ తన వార్డులో షరాఫ్ బజార్ నుండి కలుగొట్ల రోడ్డు వరకు రోడ్డు మంజూరు అయి తవ్వి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదని దళిత కాలనీలు అంటే అంత చిన్న చూపా అని నిలదీశారు. ఐదవ వార్డు కౌన్సిలర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ తన వార్డులో పనులకు టెండర్లు పిలిచి ఐదు సార్లు అయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 16వ వార్డు కౌన్సిలర్ వాహిద్ తమ పదవి కాలం ముగుస్తుందని కౌన్సిలర్ల పేర్లతో కూడిన శిలాఫలకం వేయించాలని కోరారు. అనంతరం కమీషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ నలుగు కూడలి మధ్య ఉన్న పద్మశ్రీ గ్రహీత మాచాని సోమప్ప విగ్రహం వద్ద జాతీయ జెండా ఉంటే బాగుంటుందని ఆలోచన వచ్చిందని, కౌన్సిల్ సభ్యులు ఇతరులు వ్యతిరేకం తెలిపారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి పరిగణంలోకి తీసుకొని శివ సర్కిల్లోనే జాతీయ జెండాను పెట్టాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఎవరు కూడా ఎటువంటి రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదని, పద్మశ్రీ మాచాని సోమప్పను ప్రతి ఒక్కరు గౌరవిస్తున్నారని తెలిపారు. అలాగే వెంకటాపురం కాలనీ, వీవర్స్‌కాలనీ, గాంధీనగర్ 15 ఆర్థిక సంఘం నిధులతో పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఇక మూడవలో, ఐదవ వార్డు, ఎనిమిదవ వార్డు పనులు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం దాదాపు రూ.1కోటీ 50లక్షల మేర బిల్లులు రాక పోవడంతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్ స్వాతి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ప్రాంతానికి రైల్వే లైన్ కొరకు ఎమ్మెల్యే బీవీ కేంద్రమంత్రికి వినతి పత్రం అందించడం పట్ల ప్రజల తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నామని ఇందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అజెండా లోని 16,17 అంశాలు మినహా మిగిలిన అంశాలు ఆమోదిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో డిఈఈ నీరజ, రాజు నాయక్ ఏఈలు మదన్ మోహన్, శరత్ చంద్ర, ఆర్వో అస్లాం, టిపిఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల గురించి మాట్లాడుతున్న కౌన్సిలర్లు



కౌన్సిలర్ దయసాగర్ కు ప్రత్యేక సీటు కేటాయించాలని అంటున్న టీడీపీ కౌన్సిలర్లు

సూర్య www.suryaa.com






కర్నూలు కేంద్ర కార్యాలయమైన జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో ఒక సంవత్సరముగా రెగ్యులర్ జిల్లా అధికారి లేక కర్నూలు పరిధిలోని ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం కర్నూలు జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి ఇంచార్జ్‌గా ఉన్న అధికారి నంద్యాల రెగ్యులర్ జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లా జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి వారానికి ఒకమారు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు బహిరంగ చర్చ. అందుచేత కార్యాలయంలోని సమస్యలు సమస్యలుగానే నెలకొన్నాయి. ఈసిలలో జరిగిన కొన్ని పొరపాట్లు వాటి కరెక్షన్‌పై అప్లై చేసుకున్న ప్రజలు రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత జిల్లా రిజిస్టర్ ఇన్సల్ వేసిన వాటికి తిరిగి అప్లై చేసుకోమని ఇంచార్జ్ అధికారి ఆదేశాలు. 2025కు సంబంధించి ఈసి కరెక్షన్స్ చేయనని అంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# రెగ్యూలర్ రిజిస్ట్రార్ కావాలి..!

- ఒకరోజే విధులకు హాజరు
- జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమస్యలు
- సిబ్బంది కొరతతో ప్రజల ఇక్కట్లు
- రిజిస్ట్రార్ కార్యాలయంకు రెవెన్యూ తగ్గుముఖం
- ఈసి కరెక్షన్ అలసత్వం
- సమస్యలు ఎదుర్కొంటున్న సామాన్యులు

ఈ సమస్య పరిష్కారం కోసం వస్తున్న సామాన్య ప్రజలు ఆవేదన. 2023కు ముందు 10ని॥లలో రికార్డ్ సెక్షన్‌లో డేటా ఎంట్రీ ఆప్షన్ ఉండడం చేత పని పూర్తి చేసి పంపేవారు. 2023తర్వాత ప్రతి కరెక్షన్‌కి ప్రొసీడింగ్ కంపల్సరిగా ఉండడం చేత దాదాపుగా రెండు నెలల సమయం పడుతుంది. గతంలో రిజిస్టర్ కార్యాలయాల్లో వందల కొద్ది డాక్యుమెంట్ నమోదు జరిగి రెవెన్యూ అధికంగా ఉండేది. ప్రస్తుతం స్లాట్ బుకింగ్స్ వల్ల కొన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు 78స్లాట్ బుకింగ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ స్లాట్స్ పూర్తి చేసే పరిస్థితి కూడా లేదు. ఆఫీసులలో50-60మధ్యలో డాక్యుమెంటేషన్ జరగడం లేదు. కొన్ని కార్యాలయాలకు 39 స్లాట్స్ ఉన్నాయి. జిల్లా మొత్తంపై స్టాంప్ వెండర్స్ 160మంది స్టాంప్ వెండర్స్‌కు సమయానికి అందరికి అన్ని రకాల స్టాంప్స్ అందుబాటులో లేవు. జిల్లా రిజిస్టర్ హెడ్ క్వార్టర్‌లో సిబ్బంది కొరత నెలకొంది. కొన్ని కార్యాలయాలకు సీనియర్ అసిస్టెంట్స్‌ను ఇంచార్జ్ సబ్ రిజిస్టర్‌గా ఏడాదిగా విధులు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్ సబ్ రిజిస్టర్‌లను నియమించాలని ఆయా కార్యాలయాల పరిధిలోని ప్రజలు కోరుకుంటున్నారు. కర్నూలు డివిజన్‌లోని 11సబ్ రిజిస్టర్ కార్యాలయాల నుండి జరిగిన పొరపాట్లు కరెక్షన్ చేసుకోవాలంటే కర్నూలు జిల్లా రిజిస్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలి. పలు ప్రాంతాల నుంచి పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు తాళం వేసిన జిల్లా అధికారి కార్యాలయం ఎదురవుతుంది. సంబంధిత సిబ్బందిని ప్రశ్నించగా కర్నూలుకు ప్రస్తుతం ఇంచార్జ్ జిల్లా అధికారి ఉన్నారు. వారంలో ఒకరోజు మాత్రమే అందుబాటులో ఉంటారని మిగతారోజుల్లో నంద్యాల జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలుపుతున్నారు. ఆ ఒక్కరోజైనా జిల్లా అధికారి అందుబాటులో ఉంటున్నారో లేదో ఆ దేవుడికే తెలియాలి. చాలా కాలంగా జిల్లా రిజిస్టర్ అధికారి ఆఫీస్ సెంబర్ అందుబాటులో లేకపోవడం కొసమెరుపు. జిల్లా రిజిస్టర్ కార్యాలయ రికార్డ్స్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో పాత రికార్డ్స్ డిజిటల్ నమోదు చేసే ప్రక్రియలో భాగంగా 80శాతం డిజిటల్ స్కానింగ్ నిర్వహించారు. ఆకస్మికంగా మధ్యలో రద్దు చేశారు. డిజిటల్ స్కానింగ్ ప్రక్రియ పూర్తయిన సిడిలను ప్రభుత్వ సెంట్రల్ సర్వర్‌లో నమోదు చేయలేదు. ఏదిఏమైనప్పటికీ జిల్లా రిజిస్టర్ ఆఫీస్‌లోని సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని రెగ్యులర్ జిల్లా రిజిస్టర్‌ను నియమించాలని ప్రజలు, ప్రజాసంఘాలనాయకులు,డాక్యుమెంట్ రైటర్స్ కోరుకుంటున్నారు.

కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :

## జిల్లా వ్యాప్తంగా ఆయకట్టు అభివృద్ధికి రూ.138 కోట్లతో ప్రతిపాదనలు


జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా ఆయకట్టు అభివృద్ధికి రిపేర్, రెనోవేషన్ అండ్ రెస్టోరేషన్ కింద రూ.138కోట్లతో 91పనులకు ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 1న జిల్లాకు 3,500మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు చెప్పారు. జిలాళ్లలో అదనంగా మరొక 1100 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యత ఉందన్నారు. యూరియాను అవసరమైన మేరకు రైతులు వినియోగించాలని ఈ విషయాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టిన ఈ పంటను నమోదును పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి రైతు ఈ పంట నమోదుతో పాటు పంటల బీమా కూడా చేసుకోవాలన్నారు. గత జూన్ మాసంలో ఏర్పడిన వర్షాభావం వల్ల ప్యాపిలి, డోన్, కొలిమిగుండ్ల మూడు మండలాల్లో భూగర్భ జలాలు చాలా లోతుకు వెళ్లాయన్నారు. మూడు మండలాల్లో నీటి నిర్వహణ పద్ధతిని అభివృద్ధి చేయాలన్నారు. నీటి సంరక్షణ చర్యలలో సాంకేతికంగా పరిశీలన చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆయకట్టును అభివృద్ధి చేయడానికి కోట్లతో 91పనులను ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం ఖర్చును భరిస్తాయన్నారు. రెండో దశలో 19పనులు రూ.16కోట్లతో ప్రతిపాదించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో వ్యవసాయ, జలవనరుల శాఖ, డ్వామా, భూగర్భ జలాలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీ కామేశ్వరీ సేవలు ఆదర్శం

– ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం



**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** ఫార్మా కాలేజీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీ కామేశ్వరి సేవలు ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వైద్యులకు, విద్యార్థులకు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఏపి జిడిఏ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్‌లు అన్నారు. గురువారం కళాశాల కాన్ఫరెన్స్ హాల్ నందు కాలేజ్ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, ఏపిజిడిఏ సభ్యులు డాక్టర్ లక్ష్మీ కామేశ్వరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. లక్ష్మీ కామేశ్వరి ఫార్మాసి విభాగంలోని అందరికి ఆదర్శమన్నారు. ఫార్మసి వైద్యులు, విద్యార్థులు వారి దగ్గర నుండి మహోన్నతమైన విలువలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్వీసులో విధులు నిర్వహించే వైద్యుల సేవ కొరకే ఏపి జిడిఏ ప్రతి సభ్యుడిని గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డా. సాయి సుధీర్, డా. హరీష్ చరణ్, ఫార్మా కాలేజ్ హెచ్ఒడి డా. రాజేష్, ఏపిజిడిఏ నాయకులు ప్రొఫెసర్ రామ్ శివనాయక్, డా. మాధవి శ్యామల, డా. దామం శ్రీనివాసులు, డా. జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సుంకులమ్మ దేవాలయం కొత్త ఈఓగా రాధాకృష్ణ

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని నాగలాపురంలో ఉన్న సుంకులమ్మ దేవాలయంకు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)గా రాధాకృష్ణను నియమించారు. ఈ మేరకు గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ రామ చంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. పాత ఈఓ నరసయ్య గురువారం పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కొత్త ఈఓగా రాధాకృష్ణ బాధ్యతలు చేపట్టనున్నారు. కర్నూలులో గ్రూప్-1 దేవాలయాలకు రాధాకృష్ణ ఈఓగా పనిచేస్తున్నారు.

## కిసాన్ డ్రోన్ పంపిణీ

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆర్‌కెవివై పథకంలో భాగంగా 80శాతం రాయితీతో కిసాన్‌డ్రోన్‌ను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో కిసాన్ డ్రోన్ ఫామ్ మెషినరీ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి చేతుల మీదుగా గ్రూప్ సభ్యులకు 80శాతం సబ్సిడీపై మొత్తం రూ.9,80,000లు, సబ్సీడీ రూ.7,84,000, రైతు వాటా రూ.1,96,000లు కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. సహాయ వ్యవసాయ సహాయకులు సాలురెడ్డి, వ్యవసాయాధికారి, గ్రూపు సభ్యులు, సర్పంచ్ పుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కిసాన్ డ్రోన్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేస్తున్నాం

- ఎమ్మెల్యే అఖిలప్రియ


బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం రుద్రవరం మండలం ఎర్రగుడి దిన్నె మరియు రుద్రవరం గ్రామాల మధ్యలో ఉన్నటువంటి నూతన బ్రిడ్జి భూమా పూజ కార్యక్రమంలో సోదరుడు టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని, వైసిపి నాయకులకు అవన్నీ కనిపించడం లేదని. కావాలని మా పై బురదజల్లే మాటలు మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆమె వైసీపీ నాయకులకు హితవు పలికారు.ఎర్రగుడిదిన్నె గ్రామం నుండి రుద్రవరం వెళ్లే రహదారి కి నూతన బ్రిడ్జి కోసం ఒక కోటి 46 లక్షల రూపాయలతో భూమి పూజ చేయడం జరిగిందని. ఎర్రగుడిదిన్నె గ్రామం మాజీ వైసిపీ ఎమ్మెల్యే సొంత ఊరు అయినా అందరూ వైసిపి వాళ్లే ఉన్నా కూడా ప్రజల కోసం మేము ఈరోజు బ్రిడ్జి కట్టిస్తున్నాం అన్నారు అదే మా సొంత ఊరు కొత్తపల్లెలో వైసిపీ ప్రభుత్వంలో ఏ ఒక్క అభివృద్ధి కూడా జరగలేదు అని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆరోపించారు.మాకు ప్రజలందరూ ఒకటేనని వైసిపి వాళ్ళు అయినా టిడిపి వాళ్ళైనా అవసరం ఉందని వస్తే కచ్చితంగా చేస్తామని. ఆళ్లగడ్డను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. లిక్కర్ కేసుల్లో వైసిపి నాయకులు జైలుకు వెళ్తున్నారని ప్రజల్లో ఆ ప్రస్తావన రాకుండా తెదేపాప్రభుత్వంపై బురద జల్లే మాటలు మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు.టిడిపి అంటేనే భూమా కుటుంబమని. మేము గెలిస్తే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో మమల్ని గెలిపించిన ప్రజలందరికీ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.ఎర్రగుడిదిన్నె అయినా కొత్తపల్లి అయినా ఆళ్లగడ్డ తాలూకాలో ఎక్కడైనా సరే ఎవరైనా సరే ఏ సమస్య ఉన్న నన్ను అడగండి నేను చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు గంగుల పృథ్వీరాజ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.